క్లుప్తంగా

23 నుంచి ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం అల్మాస్‌పేటలోని బందనవాజ్ గేసు దరాజ్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా 23వ తేదిన రాత్రి పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ స్వగృహం నుంచి ఫకీర్ల మేళతాళాలతో ఊరేగింపుగా గంధం కలశాన్ని దర్గా వద్దకు చేర్చనున్నట్లు తెలిపారు. అనంతరం గురువుల మజార్ల వద్ద సమర్పించి ఫాతెహా నిర్వహిస్తారన్నారు. 24న ఉరుసు ఉత్సవం నిర్వహిస్తామని, రాత్రి పూలచాందినిని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చనున్నట్లు తెలిపారు. 10 గంటలకు ఖవ్వాలీ కచేరి ఉంటుందన్నారు. 25న సాయంత్రం 5 గంటలకు దర్గా ఆవరణలో తహలీల్ ఫాతెహాతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఎన్నికల అలవెన్సులు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఎన్నికల అలవెన్స్ తక్షణం చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి సుభాషిణి, జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించిన ప్రతి ఆశా కార్యకర్తకు రూ. 500 ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలలో ఎన్నికల విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు అలవెన్సులు చెల్లించడం లేదన్నారు. తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి. చంద్రశేఖర్, ఆశా యూనియన్ నాయకురాళ్ళు మరియమ్మ, అమ్ములు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వం వేసవి సెలవులు ఇచ్చినా కార్పొరేట్ విద్యాసంస్థలు ఉపాధ్యాయులపై అడ్మిషన్ల పేరుతో ఒత్తిడి చేయడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనారాయణ శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రకరకాల క్లాసులు, వర్క్‌షాప్‌ల పేరుతో వేధించడం దారుణం అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చైతన్య, నారాయణ విద్యాసంస్థలు నడుస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకున్న చిన్నారులతో బాసట సంస్థ నిర్వాహకులు

కడప కల్చరల్ : నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోం చిన్నారులకు ఆదివారం స్థానిక యువత నూతన వస్త్రాలను బహూకరించింది. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, చిల్డ్రన్స్ హోం నిర్వాహకులు మేరువ బాలాజీరావు, సంస్థ సభ్యులు డీపీ కార్తీక్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులైన వంశీ, విష్ణు, రాకేష్, శివరాంలు విద్యార్థులకు అవసరమైన నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రమౌళిరెడ్డి, టి.సుధన్వ, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు మంజూరు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నాడు ఓటు వేసేందుకు వెళ్లి విధులకు హాజరు కాని వారికి సెలవు మంజూరు చేయాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ కొంతమందికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించి మిగిలిన వారికి కల్పించకపోవడం తగదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల్లో పలువురికి ఈనెల 13వ తేదిన ఓటుహక్కు వినియోగించుకునేందుకు అనేక ఆటంకాలు సృష్టించారన్నారు. కొంతమంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోవడంలో భాగంగా పోలింగ్ బూత్‌ల వద్ద ఆలస్యమై డ్యూటీలకు రాలేని స్థితి నెలకొందన్నారు. అటువంటి వారికి గైర్హాజరు వేయడం తగదన్నారు. ఉద్యోగుల గైర్హాజరును రద్దు పరిచి ఆరోజు సెలవు మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నామన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

సిద్దవటం: మండల శివారులోని శ్రీ పెంచల లక్ష్మినరసింహ స్వామి దేవస్థానంలో స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కార్యదర్శి పాలెం నరసింహ తెలిపారు. ఆదివారం ఆయన సిద్దవటంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహ వాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, కలశపూజ, నవగ్రహ నరసింహ జపం నిర్వహిస్తామని తెలిపారు. 22న సుదర్శన హోమం, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 23న తెల్లవారు జామున గరుడసేవ, సుదర్శన హోమం, అనంతరం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం

కడప కల్చరల్ : నగర పరిధి బిల్టప్ సమీపంలోని హోమియోపతి కాలేజీ దగ్గర ఉన్న ఆచార్ల కాలనీలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు కమనీయంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. రాత్రి చేపట్టిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. శనివారం సాయంత్రం గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. స్వామి, అమ్మవారిని ఉత్సవ పీఠంపై అధిష్ఠింపజేసి, విశేష పూజలు చేశారు. అనంతరం కాలనీ వీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవారు



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉందని, ఎవరైన గ్రామాల్లో గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని కడప రూరల్ సీఐ నాగరాజు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌటింగ్ సందర్భంగా ఇరు పార్టీల వారు ఎలాంటి రెచ్చగొట్టే ప్రయత్నాలు, ప్రసంగాలు, టపాసులు పేల్చడం వంటి పనులు చేయరాదన్నారు. పెట్రోల్ బంకు యజమాన్యానికి ఓవిజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న రోజులు పెట్రోల్ బంకులో బాటిల్స్‌లో, క్యాన్‌లల్లో పెట్రోల్ పోయవద్దన్నారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్ల సృష్టిస్తే అటు వంటి వారికి హౌస్ అరెస్టులు, గ్రామ బహిష్కరణలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.



పెండ్లిమర్రి: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పాయసంపల్లె, అలిదెన గ్రామాలకు చెందిన ఇరుపార్టీల నాయకులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తరువాత గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని సూచించారు. రౌడీషీటర్, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెండు గ్రామాలకు చెందిన ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

వేముల : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎవరైన ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ధనంజేయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘర్షణలకు పోకుండా శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో ట్రబుల్స్ చేసే వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల వారిని స్టేషన్‌కు పిలిపించి కౌంటింగ్ రోజు కానీ తర్వాత కానీ గొడవలకు పాల్పడ వద్దన్నారు.



వీఎన్‌పల్లె : రాజకీయ పార్టీల నాయకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకటరెడ్డి

జూన్ 6 వరకు ప్రతి ఒక్కరు అధికారులు చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. కౌంటింగ్ రోజు టపాసులు కాల్చకూడదనీ, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. ఎవరైన గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో బర్సీ

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా, జహీరియాలో వెలసిన శ్రీ హజరత్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో బర్సీ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనసందోహం నడుమ పీఠాధిపతి నివాసం నుంచి పూల చాదర్, గంధం ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలోని స్వామి వారి మజార్లపై సమర్పించారు. అనంతరం ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు గంధం పంచి పెట్టారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి నుంచి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి మామిళ్ల వెంకటరంగయ్య గారి లోకనాథం పద్మశాలి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో పద్మశాలీయ అభ్యుదయం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతిభ గల పద్మశాలీయ విద్యార్థులకు పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజి హెచ్‌ఓడీ డాక్టర్ అవ్వారు వెంకట రంగస్వామి పద్మశాలి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. విలువైన సమయాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

పెండ్లిమర్రి : వెయ్యినూతలకోన క్షేత్రంలో శ్రీలక్ష్మినరసింహస్వామి జయంతి సందర్భంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి నరసింహ హరి ప్రసాద్ తెలిపారు. సోమవారం విశ్వక్సేన్ ఆరాధన, ధ్వజారోహనం, మంగళవారం అష్టోత్తర శతకలశ స్నపనం, రాత్రి శేషవాహనం, బుధవారం లక్ష్మినరసింహస్వామి జయంతి, రాత్రి హనుమత్ వాహనం, గురువారం సూర్యప్రభ వాహనం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి గరుడ సేవ, శుక్రవారం కల్యాణోత్సవం, మధ్యాహ్నం గజవాహన సేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజా అవరోహణం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకోవాలని ఆయన కోరారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మినరసింహస్వామి

కొండెక్కిన కోడి మాంసం ధరలు

అదే బాటలో కోడి గుడ్లు..

కమలాపురం : కోడి మాంసం ధరలు కొండెక్కాయి. దాదాపు నెల రోజుల నుంచి మాంసం ధరలు అదుపులో లేవు. కిలో మాంసం రూ.260-280 ధర పలుకుతోంది. ధరలు అమాంతంగా పెరగడంతో మాంస ప్రియులు మదన పడుతున్నారు. ప్రాణంతో హోల్‌సేల్ ధర రూ.151 ఉండగా రీటైల్ ధర రు.160కు పైబడి ఉంది. దీంతో కోడి మాంసం ధర కిలో రూ.260కు చేరుకుంది. స్కిన్ లెస్ అయితే దాదాపు రూ.290 ఉంది. కడప నగరంలో ఈ ధరలు అమలు అవుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో కిలో రు.280తో చికెన్ విక్రయిస్తున్నారు. స్కిన్‌లెస్ అయితే రూ.300 విక్రయం జరుగుతోంది. దీంతో మాంసం కొనాలంటే ప్రజలు జంకుతున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు మాంసం ప్రియులు చికెన్, మటన్ సెంటర్లకు పరుగులు తీస్తారు. ప్రతి ఆదివారం మాంసం భుజించడం అలవాటు చేసుకున్న మాంసం ప్రియులకు ధరలు దడలెత్తిస్తున్నాయి.

పెరిగిన గుడ్లు ధర

కోడి గుడ్ల ధర కూడా అదే దారి పట్టింది. 100 గుడ్లు హోల్ సేల్ ధర రూ.630 పలుకుతోంది. దీంతో డజన్ రూ.80 వరకు విక్రయిస్తున్నారు. చిల్లర దుకాణాల్లో ఒక గుడ్డు రూ.7కు పైగా పలుకుతోంది. కోడి గుడ్లు తిన్నామన్నా ధర దంచేస్తుందని మాంసం ప్రియులు చెబుతున్నారు.

ఉత్పత్తి తగ్గడమే కారణమా

వేసవి కాలం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ కోళ్ల ఫారం నిర్వహించడం లేదు. చిత్తూరు, కర్ణాటక తదితర దూర ప్రాంతాల్లోని కంపెనీల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ కూడా కోళ్ల ఎక్కువగా మరణిస్తున్నాయని కొన్ని కంపెనీలు పెంపకం మానేశాయి. దీంతో ఉత్పత్తి తగ్గిపోయింది. అలాగే కోళ్లకు అందించే దాణా ధర కూడా పెరిగింది. దీంతో కోళ్ల ఫారాల యజమానులు కోళ్ల ధర అమాంతం పెంచేశారు. ధర పెరగడంతో కిలో మాంసం కొనే వారు అరకిలోతోనే సరి పెట్టుకుంటున్నారని, దీంతో వ్యాపారాలు మందగించాయని దుకాణాదారులు చెబుతున్నారు.



ధర దిగి వచ్చేనా?

కోడి మాంసం ధర దిగి వచ్చేనా అని మాంసం ప్రియులు ఎదురు చూస్తున్నారు. రూ.200 ఉన్న కోడి మాసం ధర రూ.280కు వరకు పెరుగు తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇంతటితో ఆగుతుందా? లేక ధర మరింత పెరిగే అవకాశం ఉందా? అని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికే వ్యాపారాలు లేవని, ధర మరింత పెరిగితే వ్యాపారాలు ఇంకా తగ్గవచ్చని దుకాణాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మసీదు ఇనాం భూములకు వేలం వేయండి

చెన్నూరు : స్థానిక ఖిల్లా మసీదు సంబంధించిన ఇనాం భూములకు బహిరంగ వేలం వేయకుండా కడప వక్ఫ్ బోర్డ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న స్థానిక మైనార్టీలు ఆరోపిస్తున్నారు. దీంతో వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి ఏడాది ఖిల్లా మసీదుకు సంబంధించిన ఇనాం భూములను బహిరంగ వేలం ద్వారా కౌలు రైతులకు వక్ఫ్‌బోర్డు అధికారులు ఇచ్చేవారు. కానీ అలా జరగడం లేదు. వక్ఫ్‌బోర్డ్ అధికారులు వేలం వేయకుండా తమకు ఇష్టం వచ్చినవారికి భూములు కట్టబెడుతున్నారని మైనార్టీ వర్గాలు ఆరోపిస్తున్నారు. దీంతో ఖిల్లా మసీదుకు రావలసిన ఆర్థిక ఆదాయం దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖిల్లా మసీదు అభివృద్ధికి వక్ఫ్ బోర్డ్ అధికారులు నిధులు కేటాయించకపోవడంతో మసీదు అభివృద్ధికి నోచుకోవడం లేదంటున్నారు. ఖిల్లా మసీదు ఇనాం భూములపై న్యాయ విచారణ చేసి కడప వక్ఫ్‌బోర్డు అధికారులపై విచారణ జరిపి చెన్నూరు ఖిల్లా మసీదు భూములు అనుభవిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకుని భూములను కాపాడాలని చెన్నూరుకు చెందిన మైనార్టీ కోరుతున్నారు.

వైభవంగా ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం మోహిని శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు జగదీష్ శర్మ ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నంచి భక్తులు రామాపురంలోని మోక్ష నారాయణ స్వామి ఆలయానికి తరలివచ్చారు. నిత్య కళ్యాణ మూర్తులుగా వెలుగొందుతున్న మహా లక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వామి, శ్రీ వల్లిదేవసేన ద్వికందరః సుబ్రమణ్యస్వామి ని భక్తులు ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. అనంతరం భక్తుల మధ్య సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిత్య కల్యాణాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వార్లను మాడ వీధుల గుండా గరుడ సేవ చేశారు. అలాగే రథంపై స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లీ.. దీవించవమ్మా..



పులివెందుల టౌన్: ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మ అమ్మవారు



జమ్మలమడుగు: కన్నెలూరులో కొలువైన గంగమ్మ తల్లి

పులివెందుల టౌన్ : పట్టణంలోని గ్రామ దేవత అయిన అంకాలమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అమ్మ ..అంకాలమ్మ తల్లి ..చల్లంగ చూడ మ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చవెళ్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చవెళ్లి గంగమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించు కోవడానికి నియోజకవర్గంలోని ప్రజలే కాక, అనంతపురం, కడప, కర్నూల్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లిగా అచ్చవెళ్లి గంగమ్మ తల్లి ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

వైభవంగా గంగమ్మ జాతర

జమ్మలమడుగు : కన్నెలూరులో గంగమ్మ జాతరను గ్రామ పెద్దలు వైభవంగా నిర్వహించారు. చాలా సంవత్సరాల తర్వాత గంగమ్మజాతర నిర్వహిస్తుండటంతో గ్రామ వాసులు తమ బంధువులతోపాటు స్నేహితులు కుటుంబ సభ్యులను ఆహ్వానించుకున్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకే పోలేటి యాగం అనంతరం 8 గంటల నుంచి అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో గ్రామ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలను చేపట్టారు. ఎన్నికల కోడ్ కారణంగా గ్రామంలో రాజకీయ నాయకులను దూరంగా పెట్టి గంగమ్మ జాతరను నిర్వహించారు. జాతర సందర్భంగా కన్నెలూరు వాసుల ఇళ్లు బంధువులతో కిటకిటలాడాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





పులివెందుల టౌన్ : పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె కళాతరంగిని సంస్థ రాజేష్‌బాబు కళాబృందం చిన్నారులచే జానపద, శాస్త్రీయ నృత్యాలతోపాటు సినీ గీతాలకు నృత్యాలు నిర్వహించి సందర్శకులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రాజేష్, పరిపాలనాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివి



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య సేవలు ఎన్నటికీ మరువలేమని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ రద్దు కోసం, భూమి కోసం, భుక్తి కోసం ఆయన ఎనలేని ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, సుబ్బయ్య, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి



కడప శిల్పారామంలో విద్యార్థుల నృత్యం

కడప కల్చరల్ : వేసవి సెలవులు కావడంతో నగరవాసులు ఆహ్లాదం కోసం ఆటవిడుపుగా కుటుంబాలతోసహా శిల్పారామానికి తరలివచ్చారు. ఆదివారం శిల్పారామం ప్రాంగణం సందర్శకులతో కళకళలాడింది. ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక ఆర్‌కే డ్యాన్స్ అకాడమి ప్రతినిధుల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. రాష్ట్ర శిల్పారామాల పాలనాధికారి మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎన్‌టీఆర్ అభిమానులకు సాయం



ఎన్‌టీఆర్ అభిమానులకు చెక్కులు అందజేస్తున్న ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్/ కడప రూరల్ : గత ఏడాది జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదిన సందర్భంగా ఆయన నటించిన సింహాద్రి సినిమాను రీ రిలీజ్ చేశారు. అందులో వచ్చిన కలెక్షన్స్ డబ్బులను ఆదివారం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్‌టీఆర్ అభిమానులకు అందజేశారు. ఈ సందర్భంగా కడప జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యర్రమల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సింహాద్రి సినిమా రీ రిలీజ్ సందర్భంగా వచ్చిన మొత్తాన్ని 15 మంది అభిమానులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కందుల నాగేశ్వర్‌రెడ్డి, సూర్య రాయల్, అల్లాబకాష్, దశరథ, అభిమానులు గౌస్, సాయి, సునీల్, రాంకీ, శివ, ఖాజీపేట సునీల్ పాల్గొన్నారు.

మానవత ద్వారా విశేష సేవలు



మానవతా సంస్థ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దాత

కడప కల్చరల్ : మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు సాటి మనిషిగా వారి కష్టాలను పోగొట్టేందుకు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పి.సుబ్బరాయుడు అధ్యక్షతన స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత కార్యక్రమాలకు సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదని, మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మానవత ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న క్రిమిటోరియంకు సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీలక్ష్మి నరసింహ మెడికల్స్ అధినేత పీవీఎల్ నరసింహబాబు తమవంతుగా చెరొక రూ. లక్షను చెక్కు రూపంలో సంస్థ నిర్వాహకులకు అందజేశారు. మజ్జిగ పంపిణీ కోసం సభ్యులు రాజేశ్వరమ్మ రూ. 12 వేలు ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం, రక్తదాన కమిటీ చైర్మన్ డాక్టర్ కమలాకర్‌రెడ్డి, బైరెడ్డి రామకృష్ణారెడ్డి, మద్దిక సుబ్బిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఇతర సభ్యులు పాల్గొన్నారు.